క్లుప్తంగా

వాణి మాధవి సేవలు అభినందనీయం



డాక్టర్ వాణి మాధవిని సత్కరిస్తున్న వైద్యులు, వైద్య విద్యార్థులు

అమలాపురం రూరల్: కిమ్స్ వైద్య కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కె.వాణిమాధవి సేవలు అభినందనీయమని పలువురు వైద్యులు కొనియాడారు. బదిలీపై వెళుతున్న ఆమెను శనివారం ఆసుపత్రిలో వైద్యులు, హౌస్ సర్జన్లు దుశ్శాలువాలు, మెమెంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ విభాగం వైద్యులు పవన్, సీతారామయ్య, కీర్తి, సాయి, రాజు, మూర్తి, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

గణనాథునికి పూజలు చేసిన ఎమ్మెల్యే అశోక్

యానాం: వినాయక నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా నియోజకవర్గ పరిధిలోని కనకాల పేట, గణపతినగర్, పాతబస్టాండ్, పరంపేట, అబ్దుల్‌కలామ్ నగర్, కురసాంపేట, ఓల్డ్ రాజీవ్‌నగర్ ప్రాంతాల్లో నెలకొల్పిన గణనాథుని మండపాలను శనివారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ సందర్శించి విశేష పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుండె వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



2కే వాక్ నమోదు పత్రాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ శివకుమార్ తదితరులు

ముమ్మిడివరం: గుండె వ్యాధులపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ వైద్యులు శివకుమార్ అన్నారు. పీపుల్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 29న ప్రపంచ హృదయ దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించనున్న 2కే వాక్ నమోదు పత్రాన్ని శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 29న కొండాలమ్మ చింత నుంచి ఎయిమ్స్ కాలేజీ ఆవరణ వరకూ జరగబోయే 2కే వాక్‌లో పాల్గొనేవారు ముందుగా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు నలమాటి కిరణ్, కె.సతీష్, న్యాయవాది టి.నాగరాజారావు, కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు హెల్త్ కార్డుల పంపిణీ

కాట్రేనికోన: మండలంలోని చెయ్యేరు పీహెచ్‌సీ సబ్ సెంటర్‌లో సర్పంచి చెల్లి సురేష్ ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కార్డుతో లబ్ధిదారులకు రూ.5 లక్షల వరకూ వైద్య సదుపాయం వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ త్సవటపల్లి నారాయణస్వామి, నడింపల్లి సూరిబాబు, కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రాయల్ రీక్రియేషన్ క్లబ్ లైసెన్స్ రద్దు

యానాం: యానాం నియోజకవర్గ పరిధి శివారు దొమ్మేటిపేటలో ఏడాదిగా నిర్వహిస్తున్న రాయల్ రీక్రియేషన్ క్లబ్ లైసెన్స్‌ను రద్దు చేస్తూ మున్సిపల్ కమిషనర్ ఆర్.అరుల్ ప్రకాశం శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆర్ఏఓ మునిస్వామి, యానాం ఎస్పీకి సమాచారం అందించామని చెప్పారు. సొసైటీలోని అయిదుగురు సభ్యులు కలిసి తమ రీక్రియేషన్ క్లబ్‌ను మూసేస్తున్నట్లు తమకు పిటీషన్ సమర్పించారన్నారు. క్లబ్ నిర్వాహకులు పీఎస్‌వీఎస్ఎస్‌వీ ప్రసాదరాజు, రామిశెట్టి దుర్గాకుమార్‌కు సైతం లైసెన్స్ రద్దు ఉత్తర్వులు జారీచేశారు.

గణపతికి గరిక పూజ

కాట్రేనికోన: నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా మండలంలోని వేట్లపాలెం రామాలయంలో వేంచేసి ఉన్న లక్ష్మీగణపతి స్వామికి గరిక పూజ వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ఇన్‌పుట్ సబ్సిడీ పెంచుతూ ఉత్తర్వులు

యానాం: ఆక్వా కల్చర్ సాగుచేస్తున్న మత్స్యకారులకు ఇస్తున్న ఇన్‌పుట్ సబ్సిడీని ఎకరానికి రూ.7,500 నుంచి రూ.8,500కు పెంచుతూ ఎల్జీ తమిళిసై సౌందరరాజన్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. మత్స్యకారుల సంక్షేమం దృష్ట్యా ఇన్‌పుట్ సబ్సిడీని మత్స్యశాఖ ప్రతిపాదనల మేరకు పెంచినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పుదుచ్చేరి డిస్ట్రిక్ట్ ఇండస్ట్రీస్ సెంటర్ ద్వారా ఎస్ఎస్‌సీ, ఐటీఐ, గ్రాడ్యుయేట్స్ స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనీలకు ఇచ్చే నెలవారీ స్టయిఫండ్‌ను సైతం రూ.1,500 నుంచి రూ.4,500కు, డిప్లొమా అభ్యర్థులకు రూ.2,500 నుంచి 7,500కు, డిగ్రీ, ఎంటెక్ అభ్యర్థులకు రూ.3 వేల నుంచి 9 వేలకు పెంచారు.

సచివాలయాలు... సేవా నిలయాలు

- మహాత్ముని కల సాకారం
- ఇంటి వద్దకే సకల సేవలు



జార్జిపేట సచివాలయంలో ప్రజలకు సేవలందిస్తున్న సిబ్బంది



జి.వేమవరం గ్రామ సచివాలయం

తాళ్లరేవు: గ్రామ సచివాలయ వ్యవస్థతో మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాకారమవుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి 2 వేల జనాభాకు ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు గ్రామస్థాయిలోనే సత్వర సేవలు అందిస్తున్నారు. ఒక గ్రామ సచివాలయంలో 10 నుంచి 12 శాఖల అధికారులను నియమించారు. ప్రజలకు ఏ అవసరం వచ్చినా వారి గ్రామాల్లోనే సేవలు పొందేలా వాటిని తీర్చిదిద్దారు. దీంతో సచివాలయాలకు దేశంలోనే మంచి పేరు ప్రతిష్ఠలు రావడంతో పాటు సచివాలయాలు ప్రజలకు సేవా నిలయాలుగా మారాయి. వలంటీర్ వ్యవస్థ ద్వారా పింఛన్, రేషన్, ఏ పథకం అయినా సరే ఇంటివద్దే అందించడంతో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు.

జగనన్న నిర్ణయం సాహసోపేతం

రాష్ట్రవ్యాప్తంగా సచివాలయాలు ఏర్పాటు చేయాలంటే వేల కోట్లతో కూడుకున్న ప్రాజెక్ట్. అయినా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సాహసోపేతంగా సచివాలయ ఏర్పాటు నిర్ణయం తీసుకుని వాటన్నింటినీ చకచకా పూర్తిచేసి వినియోగంలోకి తీసుకొచ్చి ప్రజల మన్ననలు పొందారు. సచివాలయాల ద్వారా ప్రభుత్వానికి సంబంధించిన వందల రకాల సేవలు అందుతున్నాయి. ముఖ్యంగా నవరత్నాలకు సంబంధించిన పింఛన్ పంపిణీ, అందరికీ ఇళ్లు, చేదోడు, చేయూత, మ్యుటేషన్, ఇల్లు–భూముల రీసర్వే, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, సీఎం, పీఎం కిసాన్ తదితర పథకాలను వలంటీర్ల ద్వారా నేరుగా లబ్ధిదారులకే అందజేస్తున్నారు. గతంలో రేషన్ కార్డు, ఇంటి స్థలాల వంటి పథకాల కోసం మండల కేంద్రాలకు కాళ్లరిగేలా తిరిగేవాళ్లమని, ఇపుడు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మా గ్రామంలోనే అన్ని సేవలు పొందుతున్నామని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తాళ్లరేవు మండలంలో
సచివాలయాల సంఖ్య: 24
నాలుగేళ్లలో మండలంలో
లబ్ధిదారుల సంఖ్య: 85096
లబ్ధిదారులకు కలిగిన లబ్ధి: రూ.230.72 కోట్లు
వైఎస్సార్ ఆసరా తీసుకున్న
లబ్ధిదారుల సంఖ్య: 2,121
వైఎస్సార్ ఆసరా ద్వారా
పొందిన లబ్ధి: రూ.10 కోట్లు
మండలంలో వివిధ రకాల
పింఛన్లు పొందుతున్న వారి సంఖ్య: 11,209
పింఛనుదారులు
పొందిన లబ్ధి: రూ.98.61 కోట్లు

ఇంటి వద్దనే పింఛన్ ఇస్తున్నారు



గతంలో పింఛన్ డబ్బులు తీసుకునేందుకు నానా పాట్లు పడేవాళ్లం. పంచాయతీ కార్యాలయానికి వెళ్లి గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది. తీరా అధికారి వచ్చిన తరువాత మిషన్ పనిచేయడం లేదని మళ్లీ రమ్మనేవారు. ఇప్పుడు మాత్రం ఒకటో తేదీనే ఇంటి వద్దకు వచ్చి మరీ చేతిలో డబ్బులు పెడుతున్నారు.

– చిట్టూరి మీనాక్షి, సీతారామపురం, కోరంగి పంచాయతీ

అడిగిన వెంటనే ధ్రువీకరణ పత్రాలిచ్చారు



కళాశాలలో చేరేందుకు ధ్రువీకరణ పత్రాలు అడిగిన వెంటనే ఇచ్చారు. గతంలో ఒక్క సర్టిఫికెట్ కోసం కార్యాలయాలు, అధికారుల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది. అయితే ఇప్పుడు దరఖాస్తు చేసుకున్న గంటల వ్యవధిలోనే సర్టిఫికెట్‌లు ఇస్తున్నారు. థాంక్స్ టు జగనన్న.

– వి.దుర్గా ప్రసాద్, కేశవపురం బైపాస్ కాలనీ, తాళ్లరేవు పంచాయతీ

పేదలకు అండగా జగనన్న ప్రభుత్వం

- మంత్రి విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్
- భీమనపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం



ఉప్పలగుప్తంలో సంక్షేమ పథకాల వివరాలను లబ్ధిదారునికి అందిస్తున్న శ్రీకాంత్

ఉప్పలగుప్తం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్ అన్నారు. మండలంలోని ఉప్పలగుప్తం బడుగుపేట, మధురపేట, చీకట్లపాలెం ప్రాంతాల్లో శనివారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును ఆరా తీశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నిరుపేదలందరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. ఇళ్లు లేని వారు ఉండకూడదనే ఉద్దేశంతో పార్టీలకతీతంగా ఇళ్ల పట్టాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, ఉపసర్పంచ్ మోకా శ్రీను, మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి, రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ చీకట్ల రెడ్డినాయుడు, వైఎస్సార్ హార్టికల్చర్ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ మోటూరి సాయి, మండల చైర్మన్ మానే శ్రీను, చిక్కం బాలసుబ్రహ్మణ్యం, మోటూరి సత్యంకాపు, పోతుమూడి కొండబాబు, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పలువురిని పరామర్శించిన ఎమ్మెల్సీ



మురమళ్లలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్

ఐ.పోలవరం: మండలంలోని వివిధ గ్రామాల్లో పలువురిని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ శనివారం పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మురమళ్లలోని లైన్‌పేటకు చెందిన లంక వంశీ కుటుంబ సభ్యులను, కొబ్బరి చెట్టు మీద నుంచి ప్రమాదవశాత్తూ పడి మృతి చెందిన అదే గ్రామానికి చెందిన కొమానపల్లి ఏసుబాబుల కుటుంబాలను ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కొమరగిరి గ్రామానికి చెందిన వీధి భాస్కరరావు కుటుంబాన్ని, టి.కొత్తపల్లి అరుంధతినగర్‌లో నవరపు రామకృష్ణ కుటుంబాలని పరామర్శించారు. ఎమ్మెల్సీ వెంట పార్టీ మండల కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, మురమళ్ల సర్పంచ్ కాశీ రాజుబాబు, వీరేశ్వర స్వామి దేవస్థాన చైర్మన్ పెన్మత్స వాసురాజు, లంక ఏడుకొండలు తదితరులున్నారు.

ఇద్దరికి విద్యుదాఘాతం



విద్యుత్ వైర్లను సరిచేస్తున్న విద్యుత్ సిబ్బంది

ఉప్పలగుప్తం: మండలంలోని చల్లపల్లి గ్రామంలో నేలకొరిగిన విద్యుత్ స్తంభాల తీగలు తగిలి విద్యుదాఘాతంతో ఇద్దరు వ్యక్తులు తీవ్ర గాయాల పాలయ్యారు. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం చల్లపల్లి గ్రామంలోని తూర్పు రోడ్డులో ఉన్న చెరువుల దారిలో శుక్రవారం రాత్రి రెండు విద్యుత్తు స్తంభాలు విరిగి నేలపై పడ్డాయి. అనంతరం చేపల పట్టుబడి నిమిత్తం చెరువు వద్దకు వెళుతున్న సుంకర రాజన్న, భోగిశెట్టి సాయిలకు నేలపై ఉన్న విద్యుత్ తీగలు తగలటంతో విద్యుదాఘాతం సంభవించింది. వెంటనే అక్కడున్న స్థానికులు రాజన్నను అమలాపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. దారి పొడవునా స్తంభాలు పక్కకు ఒరిగాయని పది రోజుల క్రితమే సచివాలయంలో ఫిర్యాదు చేసినా ఎటువంటి స్పందన లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఏఈ శ్రీహరిని వివరణ కోరగా గుర్తు తెలియని ట్రాక్టర్ ఢీకొనడంతో స్తంభాలు విరిగి విద్యుత్ వైర్లు నేలకొరిగాయన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు.

జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఐ.పోలవరం: నియోజకస్థాయి పోటీల్లో సత్తా చాటి ఈ నెల 25, 26 తేదీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు కొమరగిరి జెడ్పీ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్–17 పి.మానస(వాలీబాల్), కాశా గణేష్(బ్యాడ్మింటన్), తాటిపాక అశోక్(షార్ట్ పుట్), అండర్ 14–విభాగంలో కె.లోహిత్య(వాలీబాల్), యల్ల యజ్ఞేష్(వాలీబాల్), సంగాడి శ్రీనివాస్(వాలీబాల్), పెయ్యల మనోజ్(త్రో బాల్), సంగాడి శ్రీనివాస్(షార్ట్ పుట్), జి.అలేఖ్య(షార్ట్ పుట్), వి.శ్రావణ జ్యోతి(షార్ట్ పుట్), సంగాడి శ్రీనివాస్(100 మీటర్ల పరుగు), పెయ్యల మనోజ్(200 మీటర్ల పరుగు), సంగాడి శ్రీనివాస్(600 మీటర్ల పరుగు), ఎ.జీషన్ (అథ్లెటిక్స్), తాటిపాక వంశీ(షార్ట్ పుట్)లు ఎంపికయ్యారు. వారంతా జిల్లా స్థాయి పోటీల్లో విజయం సాధించాలని ఎంపీపీ మోర్తరాణి మిరియం జ్యోతి, జెడ్పీటీసీ సభ్యుడు ముదునూరి సతీష్ రాజు, సర్పంచ్ వరసాల విజయ చాముండేశ్వరి, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

ఇరువర్గాల ఘర్షణలో ముగ్గురికి గాయాలు

అమలాపురం రూరల్: ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ముగ్గురికి గాయాలైన ఘటన ఎ.వేమవరంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ అందే పరదేశి తెలిపిన వివరాల ప్రకారం ఎ.వేమవరం గ్రామానికి చెందిన లింగోలు సతీష్ ఇంటిపై ఒకవర్గం దాడి చేయగా అది ఘర్షణకు దారి తీసింది. ఈ ఘటనలో ముగ్గురు గాయపడగా అమలాపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సంఘటనా స్థలానికి రూరల్ సీఐ వీరబాబు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం ఇరువర్గాలు ఒకరిపై మరొకరు ఫిర్యాదుచేశారు. రాకర్తి నారాయణమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏడుగురిపై, లింగోలు సతీష్ ఇచ్చిన ఫిర్యాదుపై ఎనిమిది మందిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ పరదేశి తెలిపారు.

సచివాలయాల్లో నగదు రహిత లావాదేవీలు



నగదు రహిత లావాదేవీలపై మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమోహన్

అల్లవరం: ప్రతి గ్రామ సచివాలయంలో నగదు రహిత లావాదేవీలు నిర్వహించాలని ఎంపీడీఓ కృష్ణమోహన్ అన్నారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో నగదు రహిత లావాదేవీలపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి శనివారం శిక్షణా తరగతులు నిర్వహించారు. సచివాలయంలో అందించే పౌర సేవలకు వినియోగదారుల నుంచి వసూళ్ల విషయంలో డిజిటల్ విధానంలో లావాదేవీలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వరరావు, విస్తరణాధికారి లక్ష్మణరావు, కార్యదర్శులు దుర్గా శ్రీనివాస్, రాజ్‌మోహన్, కేవీవీ సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ముగ్గురు హిజ్రాల అరెస్ట్

అమలాపురం రూరల్: పట్టణం సావరంలో దారి దోపిడీకి పాల్పడిన ముగ్గురు హిజ్రాలను అరెస్టు చేసినట్లు డీఎస్పీ అంబికా ప్రసాద్ శనివారం రాత్రి తెలిపారు. పట్టణంలోని సావరం బైపాస్ రోడ్డులో ముగ్గురు హిజ్రాలు గురువారం రాత్రి ఓ యువకుడి మెడలో బంగారు గొలుసును లాక్కుని ద్విచక్రవాహనంపై పరారయ్యారు. శుక్రవారం ఉదయం యువకుడు ఘటనపై ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారించి నేరానికి పాల్పడిన ముగ్గురు హిజ్రాలను గుర్తించి శనివారం కాకినాడ వలసపాకలకు చెందిన రెల్లి రవి(స్వీటీ), రేచర్లపేటకు చెందిన ఏడిద రమేష్(కీర్తి), గుల్లపల్లి రాజు(అమూల్య)లను అరెస్టు చేశారు. వారి నుంచి బంగారు గొలుసు, నేరానికి ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వారిని అమలాపురం ఏజేఎఫ్ సీఎం కోర్టులో హాజరుపరచగా కోర్టు 14 రోజులు రిమాండ్ విధించడంతో వారిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు పంపించినట్లు డీఎస్పీ అంబికా ప్రసాద్ తెలిపారు.

స్వచ్ఛతా హీ సేవపై అవగాహన సదస్సు

అమలాపురం రూరల్: పురపాలక సంఘం పరిధిలోని మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవ, ఇండియన్ స్వచ్ఛతా లీగ్–2.0 అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. పురపాలక సంఘం శానిటేషన్–ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు బండి వీరన్న, చింతా నాగేంద్ర ప్రసాద్, వంకాయల సతీష్‌లు విద్యార్థులకు చెత్త నిర్వహణపై అవగాహన కల్పించారు. చెత్తను వేరు చేయడం, హోమ్ కంపోస్టింగ్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల నిషేధం గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బీఆర్ కామేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మధుమేహ వ్యాధిపై అవగాహన సదస్సు

తాళ్లరేవు: తాళ్లరేవు శివారు రంగనాయకపురం గ్రామంలో స్థానిక లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం మధుమేహ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. శిబిరంలో తాళ్లరేవు శతజ్ఞ ఆస్పత్రి వైద్యులు కామిశెట్టి పల్లంరాజు పలువురిని పరీక్షించి, షుగర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా మారిన ఆహారపు అలవాట్లు, లోపించిన శారీరక శ్రమ, ఒత్తిళ్ల కారణంగా అధిక శాతం మంది ఈ వ్యాధి బారిన పడుతున్నారన్నారు. ఈ సందర్భంగా వైద్యుడు పల్లంరాజును క్లబ్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చోడే శ్రీనివాస్, ప్రతినిధులు బి.శ్రీనివాసరెడ్డి, రాయపరాజు, కట్టా ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొత్త భవనం కోసం వినతి

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీలోని సూర్యనగర్ వార్డు సచివాలయాన్ని నిర్వహిస్తున్న స్థానిక కమ్యూనిటీ హాల్ భవనం శిథిలమై శ్లాబ్ బీటలు తీసి ప్రమాదకరంగా మారింది. దీంతో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని సచివాలయ ఉద్యోగులు భయపడుతున్నారు. అందుకే సచివాలయాన్ని అక్కడి నుంచి మరో భవనంలోకి మార్చాలని కోరుతున్నారు. దీనిపై మున్సిపాలిటీ ఏఈకి జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు, కౌన్సిలర్ మట్టపర్తి నాగేంద్ర శనివారం వినతి పత్రం అందజేశారు.

ప్రభుత్వ భవనాలను సకాలంలో పూర్తి చేయాలి

అమలాపురం రూరల్: సచివాలయ పరిధిలో నిర్మిస్తున్న ఆర్‌బీకేలు, సచివాలయం, వెల్‌నెస్ సెంటర్‌లు పూర్తి నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని ఎంజీఎన్ఆర్‌జీఎస్ చీఫ్ ఇంజినీర్ కృష్ణారెడ్డి అన్నారు. పీఆర్ సమావేశ మందిరంలో జిల్లా పీఆర్ ఇంజినీర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో శనివారం జరిగిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై భవన నిర్మాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సదస్సులో పీఆర్ ఇంజినీర్లు శివ ప్రసాద్, అన్యం రాంబాబు, పీఎస్ రాజకుమార్, భూషణ్ ప్రసాద్, రామ్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మరణించినా జీవించే అవకాశం

అమలాపురం రూరల్: అవయవ దానంతో మరణించిన తర్వాత కూడా జీవించే అవకాశం లభిస్తుందని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎం.దుర్గారావుదొర అన్నారు. స్థానిక ఎస్‌కేబీఆర్ కాలేజీలో అవయవ దానంపై విద్యార్థులకు ఏర్పాటుచేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయుష్మాన్ భవ కార్యక్రమంలో భాగంగా అవయవ దానంపై అవగాహన కల్పించి, ప్రాముఖ్యత వివరించారు. ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకొచ్చి అవయవ దానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ భారతలక్ష్మి, డాక్టర్ సూర్య నగేష్, ప్రిన్సిపాల్ ఎస్‌వీ కుమార్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ట్రైనీలకు సర్టిఫికెట్ల అందజేత



ట్రైనీలకు సర్టిఫికెట్లు అందజేసిన మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, డిపో మేనేజర్ మూర్తి తదితరులు

అమలాపురం రూరల్: ఆర్టీసీ అమలాపురం డిపోలోని డ్రైవింగ్ స్కూల్‌లో హెవీ డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న 16 మంది ట్రైనీ అభ్యర్థులకు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె.రవికుమార్ సర్టిఫికెట్లను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ శిక్షణ కళాశాలలో డ్రైవర్లకు ప్రాక్టికల్ శిక్షణతో పాటు నిర్వహణపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ అక్టోబర్ రెండో వారంలో ఎనిమిదో బ్యాచ్ శిక్షణా తరగతులు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో మెకానికల్ అసిస్టెంట్ ఇంజినీర్ జీఆర్ఎల్ దేవి, ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్ ప్రతిమా కుమారి, సెక్యూరిటీ ఎస్‌ఐ ఐ.నాగ మునీంద్ర, ఓపీఆర్ఎస్ ఇన్‌చార్జి ఎన్.వరహాలబాబు తదితరులు పాల్గొన్నారు.

చీమల మందు తాగి వ్యక్తి మృతి

తాళ్లరేవు: మండల పరిధిలోని గాడిమొగ గ్రామానికి చెందిన బొడ్డు లోవరాజు(36) చీమల మందు తాగి మృతి చెందినట్లు కోరంగి ఎస్‌ఐ పి.శ్రీనివాస్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం మేరకు చేపల వేటతో జీవనం సాగించే లోవరాజు వారం రోజులుగా ఇంటి వద్దనే మద్యం తాగుతూ ఉండిపోవడంతో కుటుంబ సభ్యులు నిలదీశారు. దీంతో మనస్తాపం చెందిన లోవరాజు చీమల మందు తాగేశాడు. తాళ్లరేవు సామాజిక ఆస్పత్రికి తీసుకెళ్లడంతో అక్కడ ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. లోవరాజు తండ్రి బొడ్డు సుబ్బారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్‌కుమార్ తెలిపారు.

పితృ దేవతా పూజా మహోత్సవాలు

అమలాపురం రూరల్: ఈ నెల 28వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి అక్టోబర్ 14వ తేదీ రాత్రి 11 గంటల వరకూ స్థానిక ఎర్రవంతెన–నల్లవంతెన మధ్య గల దక్షిణేశ్వర శక్తిస్థల్‌లో పితృ దేవతా పూజా మహోత్సవాలు నిర్వహించనున్నట్లు అక్షయపాత్ర ప్రతినిధి సలాది వెంకట సాయిరాం శనివారం తెలిపారు.

రాష్ట్ర కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయండి

ముమ్మిడివరం: కాకినాడ సూర్య కళామందిరంలో ఆదివారం జరిగే రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ కోనసీమ జిల్లా శాఖ కౌన్సిల్ సమావేశానికి కార్యవర్గ సభ్యులంతా హాజరై జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి పీవీవీ సత్యనారాయణరాజు పిలుపునిచ్చారు. శనివారం ముమ్మిడివరంలో జిల్లా అధ్యక్షుడు జేఎన్ఎస్ గోపాలకృష్ణ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. రాష్ట్ర కౌన్సిల్ ఎన్నికల్లో రాష్ట్ర అధ్యక్షుడిగా పోటీ చేయనున్న పీఎస్ఎస్ఎన్ శాస్త్రి అభ్యర్థిత్వాన్ని జిల్లా శాఖ బలపరుస్తుందని పలువురు పేర్కొన్నారు. సమావేశంలో ఎస్‌వీ నాయుడు, ఎన్.సూర్యభాస్కరం, జేవీఎల్ నరసింహారావు, ఎం.ఆశీర్వాదం, వైవీ రమణ, డి.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీగణపతి నిమజ్జనం

అమలాపురం రూరల్: మండలంలోని సమనసలో ఏర్పాటుచేసిన లక్ష్మీగణపతి స్వామి విగ్రహ నిమజ్జనం శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం స్వామి వారి ఊరేగింపు అంగరంగవైభవంగా జరిగింది. అనంతరం ప్రధాన పంట కాలువలో నిమజ్జనం చేశారు.

వెల్‌నెస్ సెంటర్‌గా హోమియోపతి ఆస్పత్రి

తాళ్లరేవు: మండల పరిధిలోని కోరంగిలో ఉన్న ప్రభుత్వ హోమియోపతి ఆస్పత్రిని వెల్‌నెస్ సెంటర్‌గా అభివృద్ధి చేస్తున్నట్లు సీనియర్ హోమియోపతి వైద్యుడు టీవీఆర్ఎస్ఎన్ జగదీశ్వరరావు శనివారం తెలిపారు. ఆయుష్ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆయా పనులను ప్రారంభించినట్లు తెలియజేశారు. ఆస్పత్రి ప్రాంగణానికి సంబంధించి ఉన్న కాంపౌండ్ వాల్ నిర్మాణానికి దాతలు సహకరించాలని కోరారు.

అభివృద్ధి పనుల పరిశీలన



జీజీఎంపీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అల్లవరం: గడప గడపకూ మన ప్రభుత్వం నిధులతో గోడి పంచాయతీ పరిధిలోని జాంబానిపేటలో నిర్మిస్తున్న పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ శనివారం పరిశీలించారు. పనుల్లో నాణ్యత ఉండాలని, త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్సీ అన్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు రేవు శ్రీనివాసరావు, మాకే వెంకటరమణ ఉన్నారు.

ఫార్మసీ విద్యార్థుల రక్తదానం



రక్తదానం చేస్తున్న ఫార్మసీ విద్యార్థులు

తాళ్లరేవు: ఫార్మసీ వారోత్సవాల్లో భాగంగా కోరంగి ఫార్మసీ కళాశాలలో శనివారం సుమారు 60 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కళాశాల సమావేశపు హాలులో ఏర్పాటుచేసిన ఈ శిబిరాన్ని కళాశాల కరస్పాండెంట్ ప్రగళ్లపాటి కనకరాజు ప్రారంభించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సుమారు 50 మంది విద్యార్థులు, సిబ్బంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సువర్ణజ్యోతి మాట్లాడుతూ ఫార్మసీ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులతో రోజుకొక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో 200 ఔషధ మొక్కలను నాటారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ చిట్టూరి కలికిమూర్తి, కళాశాల ఏఓ మాల, అధ్యాపకులు పాల్గొన్నారు.